గరీబ్‌రథ్‌కు ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు
» అదనంగా అందుబాటులోకి 117 థర్డ్ ఏసీ బెర్తులు
» సైడ్ విండో మిడిల్ బెర్తు తొలగింపు

కారు బోల్తా పడి యువకుడి మృతి
» ముగ్గురికి తీవ్ర గాయాలు
· 7లో

వదలని వాన

జిల్లా అంతటా తేలికపాటి వర్షాలు



తుమ్మపాల బొజ్జన్నకొండ వద్ద నీట మునిగిన వరి నారుమడులను పరిశీలిస్తున్న అధికారులు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. సోమవారం పలు మండలాల్లో ముసురు కమ్ముకొని తేలికపాటి జల్లులు కురిశాయి. ఈ వర్షాలు ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న రైతులకు లాభదాయకమని వ్యవసాయాధికారులు అంటున్నారు.

అనకాపల్లిలో సోమవారం ఉదయం నుంచి ముసురు ఆవరించింది. సాయంత్రం నుంచి తేలికపాటి జల్లులు కురిశాయి. రావికమతం మండలంలో కల్యాణపులోవ జలాశయానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. జలాశయ పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 460 అడుగులు కాగా, సోమవారం సాయంత్రానికి 458.9 అడుగులకు నీటిమట్టం చేరింది. ప్రస్తుతం ఇన్‌ఫ్లో 75 క్యూసెక్కుల నీరు సర్పానదిలోకి వదిలారు. రాత్రికి నీటిమట్టం మరింత పెరిగితే మిగిలిన గేట్లను ఎత్తే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సర్పా నదీ పరివాహక ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. మాకవరపాలెం, గొలుగొండ, సబ్బవరం, కశింకోట, మునగపాక పరిసరాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు తేలికపాటి జల్లులు కురుస్తూనే ఉన్నాయి. అనకాపల్లి నుంచి చోడవరం వెళ్లే ప్రధాన రహదారిలో తుమ్మపాల వద్ద రహదారిపై నీరు చేరడంతో వాహనాలను బైపాస్ మీదుగా మళ్లించారు. జిల్లాలో మిగిలిన అన్ని మండలాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు తేలికపాటి జల్లులు కురవడంతో వివిధ పనులపై రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. కాగా పలు చోట్ల వరి నారుమడులు నీట మునగడంతో వ్యవసా యాధికారులు పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు.



వడ్డాది కాజ్‌వే పైనుంచి ప్రవహిస్తున్న పెద్దేరు

వడ్డాది కాజ్‌వే పైనుంచి నీటి ప్రవాహం

బుచ్చెయ్యపేట: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వడ్డాదిలో పెద్దేరు నది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీనికి తోడు పెద్దేరు రిజర్వాయర్ గేటు తెరిచి నీరు కిందకు వదిలేయడంతో సోమవారం వడ్డాది కాజ్‌వే పైనుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కాజ్‌వే పైనుంచి రాకపోకలను నిలిపివేశారు. వాహనాలు రాకుండా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. వాహనాలు పాత వంతెనపై నుంచి రాకపోకలు సాగించాయి.

రావణాపల్లి రిజర్వాయర్ గట్టుకు గండి

» అధికారులు అప్రమత్తం

» యుద్ధప్రాతిపదికన పూడ్చివేత



రావణాపల్లి రిజర్వాయర్ గండి పూడ్చివేతను పరిశీలిస్తున్న ఆర్డీవో జయరాం

గొలుగొండ, జూలై 22:
మండలంలోని రావణాపల్లి రిజర్వాయర్ గట్టుకు గండి పడడంతో సోమవారం ఉదయం స్థానికులు గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో అప్రమత్తమయ్యారు. దీంతో నర్సీపట్నం ఆర్డీవో జయరాం, పోలీసులు రిజర్వాయర్ వద్దకు చేరుకుని గండిని ఇసుక బస్తాలతో పూడ్చే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్డీవో జయరాం మాట్లాడుతూ రిజర్వాయర్ దిగువనున్న జి.కొత్తూరు. గుండుపాల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా వుండాలన్నారు. రిజర్వాయర్ గట్టుపై ఆక్రమణలను తొలగించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. రిజర్వాయర్ గట్టు పరిస్థితిపై రెవెన్యూ అధికారులు ఎప్పటికప్పుడు తమకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ఆయన వెంట ఇరిగేషన్ జేఈలు రుత్తల రామన్నపాత్రుడు, జయసూర్య, డీటీ భరత్‌కుమార్, స్థానిక మాజీ సర్పంచ్ కొల్లి సత్యనారాయణ, గబ్బాడ మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఈర్లె రాజబాబు, తదితరులు వున్నారు.



దారి ఘోరం

అనకాపల్లి- చోడవరం రోడ్డులో బవులవాడ మలుపు వద్ద భారీ గోతుల్లో చేరిన వర్షపునీరు

గోతులమయంగా అనకాపల్లి- చోడవరం రోడ్డు

» వర్షపు నీరుతో చెరువును తలపిస్తున్న వైనం

» వాహనచోదకులకు తప్పని అవస్థలు



అనకాపల్లి - చోడవరం రోడ్డులో ఊడేరు వద్ద ఏర్పడిన గోతులు

తుమ్మపాల, జూలై 22:
అనకాపల్లి- చోడవరం రోడ్డులో ప్రయాణిస్తే పలు చోట్ల ఇది రోడ్డా.. చెరువా? అనే సందేహం కలుగుతుంది. ఇటు వైపు కొన్ని ప్రాంతాల్లో గొయ్యి తప్ప రోడ్డు కనిపించదు. అసలే భారీ గోతులతో ఉన్న ఈ రోడ్డులో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నీరు చేరి ఏది రోడ్డో.. ఏది గొయ్యో తెలియక వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు.

అనకాపల్లి - చోడవరం రోడ్డును ఆనుకుని తుమ్మపాల, మార్టూరు, దిబ్బపాలెం, ఊడేరు, బవులవాడ, మామిడిపాలెం గ్రామాలు ఉన్నాయి. అలాగే

... మిగతా 8వ పేజీలో



అనకాపల్లి - చోడవరం రోడ్డులో బవులవాడ వద్ద భారీ గోతుల్లో వర్షపునీరు

నిత్యం ప్రమాదాలు



అనకాపల్లి- చోడవరం రోడ్డులో భారీ గోతులున్నా గత వైసీపీ ప్రభుత్వం కనీసం మరమ్మతులు చేయించలేదు. గతంలో తరచూ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ, ఇతర ప్రజాప్రతినిధులు ఈ రోడ్డులో రాకపోకలు సాగించేవారు గానీ గోతులు పూడ్చాలనే ధ్యాసే ఉండేది కాదు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గోతుల్లో నీరు చేరి వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం హయాంలో ఈ రోడ్డు బాగుపడుతుందని ఆశిస్తున్నాం.

- సందిన చినబాబు, తుమ్మపాల

పోస్టింగ్‌ల కోసం పైరవీలు

» ఎన్నికల ముందు బదిలీపై వెళ్లి తిరిగి వస్తున్న రెవెన్యూ, పోలీస్ శాఖల్లోని అధికారుల ప్రయత్నాలు

» నేతల చుట్టూ ప్రదక్షిణలు

» కావాల్సిన స్థానాల కోసం ఆరాటం

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో తమకు నచ్చిన చోట పోస్టింగ్ కోసం రెవెన్యూ, పోలీస్ శాఖల్లోని పలువురు అధికారులు పైరవీలు మొదలెట్టినట్టు తెలిసింది. ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. సార్వత్రిక ఎన్నికల ముందు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రెవెన్యూ, పోలీసు శాఖల్లో ఉన్న పలువురు అధికారులను ఇతర జిల్లాలకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కలెక్టర్, ఎస్పీ బదిలీలను పూర్తి చేసింది. బదిలీపై వచ్చిన కొత్త కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ ఎం.దీపిక ఇప్పటికే విధుల్లో చేరారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికే పరిపాలనలో కీలక భూమిక పోషించే తహసీల్దార్ల బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్లకు స్పష్టత ఇచ్చింది. పోలీసు శాఖలో సీఐల బదిలీల కోసం విశాఖ రేంజ్ డీఐజీ ఇప్పటికే కసరత్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల ముందు జిల్లా నుంచి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాకు బదిలీపై వెళ్లిన వారంతా ఇప్పుడు సొంత జిల్లాల్లో కోరుకున్న స్థానాల్లో పోస్టింగ్‌ల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

తహసీల్దార్ల ప్రయత్నాలు

జిల్లాకు బదిలీపై వచ్చిన 24 మంది తహసీల్దార్లు ఇప్పటికే కలెక్టర్‌కు రిపోర్టు చేశారు. కలెక్టర్ వీరికి మండలాలను కేటాయిస్తూ పోస్టింగులు ఇవ్వనున్నారు. ఈ క్రమంలో కొందరు తహసీల్దార్లు జిల్లాలో తమకు కావాల్సిన చోట పోస్టింగ్ కోసం నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని తెలిసింది. కొందరు తహసీల్దార్లు తమకు ఎక్కడ పోస్టింగ్ వస్తుందో ముందుగానే ఆయా మండలాలకు సమాచారం ఇస్తున్నట్టు సమాచారం.

పోలీసు శాఖలో..


జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నం, పరవాడ పోలీస్ డివిజన్లలో 30కి పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. ఆయా స్టేషన్ల పరిధిలో సీఐల బదిలీలు త్వరలో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పలువురు తమకు అనుకూలంగా ఉన్న చోట బదిలీ కోసం ప్రజా ప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నారని తెలిసింది. గత ప్రభుత్వంలో వైసీపీ నేతలకు కొమ్ముకాసిన పలువురు తహసీల్దార్లు, ఎస్‌ఐలు, సీఐలు కూటమి ప్రభుత్వంలో కూడా మంచి పోస్టింగ్‌ల కోసం పైరవీలు ప్రారంభించడం చర్చకు దారి తీసింది.

పీఏసీఎస్‌లో రూ.2 కోట్లు గోల్‌మాల్ ?

బినామీల పేరుతో రుణాలు మంజూరు చేశారని ఆరోపణలు

» డీసీసీబీకి చెల్లించాల్సిన డబ్బులు సొంత అవసరాలకు దారి మళ్లించినట్టు సీఈవోపై అభియోగం

» విచారణకు డీసీవో ఆదేశం



జానకిరామపురం పీఏసీఎస్ కార్యాలయం

నర్సీపట్నం, జూలై 22:
రోలుగుంట మండలం జానకిరామపురం పీఏసీఎస్‌లో సుమారు రూ.2 కోట్ల మేర అవకతవకలు జరిగినట్టు జోరుగా ప్రచారం సాగుతోంది. పీఏసీఎస్ సీఈవో కృష్ణ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో విచారణకు డీసీవో ప్రేమ స్వరూపారాణి ఆదేశించారు.

నర్సీపట్నం డీసీసీబీ బ్రాంచి పరిధిలో మొత్తం 8 పీఏసీఎస్‌లు ఉన్నాయి. వాటిలో రోలుగుంట మండలంలో జానకిరామపురం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఉంది. రైతులకు రుణాలు ఇప్పించడం, రుణాలు చెల్లించిన తర్వాత డీసీసీబీలో జమ చేయడం ముఖ్య కార్యనిర్వహణాధికారి బాధ్యత. అయితే జానకిరామపురం పీఏసీఎస్‌లో ఏడాదిన్నర కాలంగా రైతులు చెల్లించిన డబ్బులు జమ చేయకుండా సీఈవో సొంత అవసరాలకు వాడుకుంటున్నారని డీసీసీబీ అధికారులు గుర్తించారు. నగదు వాడుకోవడమే కాకుండా అధికారులు నిలదీస్తే సొంత ఖర్చులకు వాడుకున్నానని సీఈవో తన సొంత దస్తూరితో పేపరు మీద రాసి ఇవ్వడం గమనార్హం. రూ.2.15 లక్షలు సొంత ఖర్చుల నిమిత్తం అడ్వాన్సుగా వాడుకున్నానని గత సంవత్సరం ఆగస్టు 8న డీసీసీబీ మేనేజర్‌కి పీఏసీఎస్ సీఈవో లెటర్ రాసిచ్చారు. ఈ విధంగా అనేక సందర్భాలలో సొంత అవసరాలకు డబ్బులు వాడుకోవడం, అధికారులు అడిగితే లెటర్లు రాసి ఇవ్వడం పరిపాటి అయింది. వ్యవసాయ భూములు లేకపోయినా బినామీల పేరుతో రుణాలు మంజూరు చేయించారని ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. లబ్ధిదారులకు పదో పరకో ఇచ్చి లక్షల్లో నొక్కేసిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఈ విషయంపై పలువురు లబ్ధిదారులు అనేక సార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. బోళెం సత్యందొర అనే రైతు రూ.1,54,900 బాకీ చూపిస్తున్నారని, తనకి రూ.35 వేలు మాత్రమే అందిందని గత ఏడాది జూలై 23 డీసీసీబీకి ఫిర్యాదు చేశారు. కొమరవోలు గ్రామానికి చెందిన బోళెం రామచంద్రుడు రూ.35 వేలు మాత్రమే రుణం అందిందని, రూ.2,23,000లు చెల్లించాలని బాకీ చూపిస్తున్నారని అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ విధంగా జానకిరామపురం పీఏసీఎస్‌లో సుమారు రూ.2 కోట్లు అవకతవకలు జరిగినట్టు అధికారులు గుర్తించినట్టు సమాచారం. సీఈవో నిధులు దుర్వినియోగం చేయడంపై బ్యాంక్ అధికారులు జిల్లా సహకార అధికారికి ఫిర్యాదు చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం, నిధులు దుర్వినియోగంపై జానకిరామపురం పీఏసీఎస్ సీఈవో కృష్ణ పై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఈనెల 19న జిల్లా సహకార అధికారిని ఎలమంచిలి డివిజనల్ కో-ఆపరేటివ్ అధికారికి ఆదేశాలు జారీ చేశారు. దీనిపై జిల్లా సహకార అధికారి(డీసీవో) ప్రేమ స్వరూపారాణిని వివరణ కోరగా జానకీరామపురం పీఏసీఎస్‌లో అవకతవకలపై విచారణకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ఎలమంచిలి డివిజనల్ సహకార అధికారి విచారణ చేసి తదుపరి చర్యలు తీసుకుంటారని చెప్పారు.



ఫార్మా వ్యర్థ జలాల కారణంగా పరవాడ పెద్ద చెరువులో చనిపోయి పైకి తేలిన చేపలు

మళ్లీ చేపలకు చేటు

ఫార్మా వ్యర్థ జలాలతో పరవాడ పెద్ద చెరువు కలుషితం

» అధిక సంఖ్యలో చేపలు మృతి

పరవాడ, జూలై 22:
స్థానిక పెద్ద చెరువులో మళ్లీ అధిక సంఖ్యలో చేపలు మృత్యువాత పడ్డాయి. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో పరవాడ పెద్ద చెరువులోకి గుట్టు చప్పుడు కాకుండా ఫార్మా వ్యర్థ జలాలను విడిచిపెట్టడంతో చెరువు కలుషితమైంది. దీంతో సోమవారం ఉదయం చెరువులోని చేపలు మృతి చెంది పైకి తేలాయి.

ఫార్మాసిటీ నుంచి కొన్ని యాజమాన్యాలు ఫార్మా ఉత్పత్తుల అనంతరం వ్యర్థ జలాలను కాలువ ద్వారా రాత్రి వేళల్లో గెడ్డల్లోకి విడిచిపెడుతున్నాయి. అవి నేరుగా పరవాడ ఊర చెరువు పక్కనున్న గెడ్డ నుంచి మల్లోడి గెడ్డలో కలిసి అటు నుంచి పరవాడ పెద్ద చెరువులోకి కలుస్తున్నాయి. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలను అదునుగా చేసుకుని ఫార్మా యాజమాన్యాలు ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. కాగా పెద్ద చెరువు కలుషితం కావడంతో పాటు అందులో చేపలు మృత్యువాత పడిన నేపథ్యంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు నీటి నమూనాలను సేకరించాలని ఆయకట్టు రైతులు డిమాండ్ చేస్తున్నారు. పీసీబీ అధికారుల నిఘా లేకపోవడం వల్లే వర్షాలు కురిసే సమయంలో వ్యర్థాలను చెరువులోకి విడిచిపెడుతున్నారని మండిపడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఫార్మా వ్యర్థ జలాలను బహిరంగ ప్రదేశాల్లో విడిచిపెట్టకుండా కఠిన చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

సవాళ్లు అనేకం


జీవీఎంసీ నూతన కమిషనర్‌కు సమస్యల స్వాగతం

» గత కమిషనర్ తీసుకున్న వివాదాస్పద నిర్ణయాలపై ఇప్పటికే కోర్టుల్లో కేసులు

» మరోవైపు కౌన్సిల్‌లో మారుతున్న రాజకీయ పార్టీల బలాబలాలు

» అన్నింటినీ అధిగమిస్తూనే నగరాభివృద్ధిపై దృష్టిపెట్టాల్సిన పరిస్థితి

» జీవీఎంసీ కమిషనర్‌గా సంపత్‌కుమార్ నేడు బాధ్యతలు స్వీకరణ



పి.సంపత్‌కుమార్

విశాఖపట్నం, జూలై 22 (ఆంధ్రజ్యోతి):
జీవీఎంసీ కమిషనర్‌గా నియమితులైన పి.సంపత్‌కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. నూతన కమిషనర్‌కు అనేక సవాళ్లు స్వాగతం పలుకుతున్నాయి. కమిషనర్‌గా ఇప్పటివరకూ పనిచేసిన సాయికాంత్‌వర్మ తీసుకున్న పలు నిర్ణయాలు వివాదాస్పదంగా మారాయి. వీటిపై హైకోర్టులో పిటిషన్లు కూడా దాఖలు చేయడంతో కేసులు నడుస్తున్నాయి.

గత కమిషనర్ సాయికాంత్‌వర్మ వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆపార్టీ నేతల ఆదేశాలకు అనుగుణంగా కొన్ని నిర్ణయాలు తీసుకున్నారనే విమర్శలు ఉన్నాయి. సిరిపురం జంక్షన్‌లోని సీబీసీఎన్‌సీ భూమిపై వివాదం నడుస్తున్నప్పటికీ అక్కడ భవన నిర్మాణాలకు అనుమతి ఇచ్చారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆ స్థలంలో కొంత భూమి భవిష్యత్తులో రోడ్డు విస్తరణలో పోతుందని రూ.65 కోట్లు టీడీఆర్‌ను జారీచేశారు. వైసీపీ అధికారం కోల్పోయిన తర్వాత దీనిపై కొంతమంది కోర్టును ఆశ్రయించడంతో సీబీసీఎన్‌సీ భూమిలో నిర్మాణ పనులను ఆపాలంటూ బదిలీపై వెళ్లడానికి ముందురోజు సాయికాంత్‌వర్మ ఆదేశాలు జారీచేశారు. అలాగే బక్కన్నపాలెంలో పదిహేనేళ్ల కిందట నిర్మించిన రోడ్డులో స్థలం పోయిందంటూ ఒక వ్యక్తికి రూ.208 కోట్ల విలువైన టీడీఆర్‌ను జారీచేశారు. అదేవిధంగా హయగ్రీవ భూమిపై వివాదం నడుస్తున్నప్పటికీ పట్టించుకోకుండా నిర్మాణాలకు అనుమతులు జారీచేయడం వివాదాస్పదమైంది. వీటన్నింటిపై జీవీఎంసీ కమిషనర్‌గా వచ్చే అధికారి తదుపరి ఉత్తర ప్రత్యుత్తరాలు కోర్టుతో జరపాల్సి ఉంటుంది. అదే సమయంలో జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికకు సోమవారం నోటిఫికేషన్ విడుదలైంది. కౌన్సిల్‌లో ఇంత వరకూ వైసీపీకి మెజారిటీ ఉండడంతో ఎన్నికతోపాటు కౌన్సిల్ సమావేశాలు ఏకపక్షంగా జరిగిపోయేవి. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడంతో జీవీఎంసీ కౌన్సిల్‌లో రాజకీయ పార్టీల బలాబలాలు మారిపోతున్నాయి. వైసీపీ కార్పొరేటర్లు 12 మంది ఆ పార్టీని వీడి టీడీపీ, జనసేనలో చేరారు. మరికొందరు కూడా

... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

ప్రమాదవశాత్తూ కాలువలో పడి ఒకరి మృతి


రామారావు మృతదేహం

రాంబిల్లి, జూలై 22: మండలంలోని లాలంకోడూరు పంచాయతీ పెద్ద యాతపాలెం సమీపంలోని కాలువలో ప్రమాదవశాత్తూ పడి ఓ వ్యక్తి మృతి చెందాడని ఎస్ఐ రంగారావు తెలిపారు. దీనికి సంబంధించి ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. శ్రీకాకుళం జిల్లా లంక గ్రామానికి చెందిన గడిదేశి రామారావు(55) సీతపాలెం సమీపంలోని గల నస్వీర కంపెనీలో కాంట్రాక్టర్ వద్ద పనిచేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం 12 గంటలు సమయంలో అతను బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తూ కాలువలో పడి మృతి చెందాడు. రాంబిల్లి సర్కిల్ సీఐ నర్సింగరావు ఆదేశాలు మేరకు ఎస్ఐ సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి కాలువలో పడి ఉన్న రామారావు మృతదేహాన్ని బయటకు తీసి, అంబులెన్స్‌లో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చామని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

కారు బోల్తా పడి యువకుడి మృతి

- ముగ్గురికి తీవ్ర గాయాలు
- నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలింపు


ప్రమాదంలో మృతి చెందిన బొడ్డు నాని

నాతవరం, జూలై 22 : కారు బోల్తా పడి యువకుడు మృతి చెందాడు. ముగ్గురు తీవ్రంగా గాయపడడంతో నర్సీపట్నం ప్రాంతీయాస్పత్రికి తరలించారు. నాతవరం పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. సోమవరం నాతవరం ఎస్సీ కాలనీకి చెందిన బొడ్డు నాని, మరో ముగ్గురు యువకులతో కారులో బయటకు వెళ్లారు. రాత్రి పది గంటలు దాటి తర్వాత గొలుగొండ నుంచి వల్లంపేట మీదుగా నాతవరం వస్తున్నారు. వల్లంపేట సమీపంలో అదుపుతప్పి కారు బోల్తా పడింది. ప్రమాదంలో బొడ్డునాని (22) అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడడంతో 108లో నర్సీపట్నం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. నాతవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


బోల్తా పడిన కారు

యువకుడి అదృశ్యం

- కొండ వాగులో కొట్టుకుపోయాడనే అనుమానాలు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన కుటుంబీకులు


యువకుడు జయవర్ధన్(ఫైల్)

కొయ్యూరు, జూలై 22: మండలంలో శరభన్నపాలెం గ్రామానికి చెందిన రీముల జయవర్ధన్ అలియాస్ బాబీ(22) ఆదివారం సాయంత్రం అదృశ్యమయ్యాడు. ఈ యువకుడు కత్తిరాలలొద్ది సమీప కొండవాగులో గల్లంతైనట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శరభన్నపాలెంకు చెందిన జయవర్ధన్ ఆదివారం సాయంత్రం విశాఖపట్నం నుంచి స్వగ్రామం వస్తూ.. కత్తిరాలలొద్ది మీదుగా నడింపాలెం వెళ్లి.. అక్కడ నుంచి శరభన్నపాలెం వెళ్లేందుకు సిద్ధపడినట్టు సమాచారం. ఈ క్రమంలో కత్తిరాలలొద్ది వద్ద సాయంత్రం 6.30 గంటల సమయంలో కొండవాగును దాటేందుకు ప్రయత్నించాడని తెలిసింది. అనంతరం అతని ఆచూకీ లభ్యంకాలేదు. దీంతో విషయాన్ని తెలుసుకున్న తండ్రి మోహన్ రాత్రి 9 గంటల వరకు జయవర్ధన్ ఫోన్‌కు ప్రయత్నించగా.. రింగ్ అయినా ఎత్తకపోవడం అనంతరం ఫోన్ పనిచేయకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో కుటుంబీకులు విషయాన్ని కొయ్యూరు ఎస్ఐ రామకృష్ణకు సమాచారమిచ్చారు. విషయం తెలుసుకున్న తహసీల్దారు రాజేశ్వరావు రామరాజుపాలెం వెళ్లి వివరాలు సేకరించారు. అలాగే కొయ్యూరు ఎస్ఐ రామకృష్ణ తన సిబ్బందితో సంఘటన జరినట్టుగా అనుమానిస్తున్న స్థలానికి చేరుకుని జయవర్ధన్ కోసం అన్వేషించారు. అయితే అదృశ్యమైన జయవర్ధనకు మూర్ఛ వ్యాధి ఉన్నట్టు తెలిసింది. ఈ క్రమంలో కొండవాగు దాటుతూ మూర్ఛ వాధి బారిన పడి గల్లంతు అయ్యాడా? లేక మరెక్కడైనా పడిపోయి అపస్మారక స్థితికి చేరుకున్నాడా అనేది మిస్టరీగా మారింది.

గర్భిణికి తప్పని ప్రసవ వేదన

- ఉధృతంగా కోడాపుట్టు గెడ్డ
- పురిటి నొప్పులు వచ్చినా ఇంట్లోనే రెండు రోజులు
- అనంతరం జీపులో ముంచంగిపుట్టు పీహెచ్‌సీకి తరలింపు
- సిజేరియన్ చేసి మృత శిశువును బయటకు తీసిన పాడేరు వైద్యులు


గర్భిణీని జీపు ఎక్కుస్తున్న దృశ్యం


మృతిచెందిన శిశువు

ముంచంగిపుట్టు, జూలై 22: గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ కోడాపుట్టు గ్రామానికి చెందిన నెలలు నిండిన గర్భిణీ కొర్రా సొనాయ్ (25) వైద్య సేవలు అందక ప్రసవ వేదన పడింది. గర్భిణికి శుక్రవారం అర్ధరాత్రి నుంచి పురిటి నొప్పులు వచ్చాయి. అయితే ఆ గ్రామ సమీపంలో గెడ్డ ఉధృతంగా ప్రవహించడంతో ఇల్లు దాటలేని పరిస్థితి ఏర్పడింది. ఏమి చేయాలో తెలియక రెండు రోజులు పాటు నొప్పులతో ఇంటిలోనే ఆమె ఉండిపోవల్సి వచ్చింది. ఎలాగైనా తల్లీబిడ్డలను బతికించుకోవాలనే తపనతో భర్త నాగేశ్వరరావు, కుటుంబ సభ్యులు గర్భిణీని ప్రైవేటు జీపులో ఒడిశా మీదుగా 70 కిలోమీటర్లు ప్రయాణం చేసి ఆదివారం ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి తీసుకువచ్చారు. గర్భిణీని పరీక్షించిన డాక్టర్ వెంటనే పాడేరు జిల్లా ఆస్పత్రికి తీసుకు వెళ్లాలని సూచించారు. అక్కడికి గర్భిణీని తీసుకువెళ్లగా వైద్యులు పరీక్షలను నిర్వహించిన అనంతరం ఆపరేషన్ చేసి చనిపోయిన బిడ్డను బయటకు తీశారని లక్ష్మీపురం సర్పంచ్ క్షేత్రినాథ్ తెలిపారు. ప్రస్తుతం తల్లి మృత్యువుతో పోరాడుతుందన్నారు. తమ పంచాయతీ పరిధిలో ప్రవహిస్తున్న గెడ్డలపై కల్వర్టులు, వంతెనలు, కాజ్‌వేలు నిర్మించకపోవడం వలన వర్షాకాలంలో ఆస్పత్రులకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

28 నుంచి అమరుల సంస్మరణ వారోత్సవాలు

జి.మాడుగుల, జూలై 22 : ఏవోబీ వ్యాప్తంగా ఈనెల 28 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు మావోయిస్టు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని మావోయిస్టు ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి గణేశ్ పిలుపునిచ్చారు. కామ్రేడ్స్ చారుమజుందార్ అమరత్వ దినం జూలై 28న వేలాది మంది అమరులను స్మరించుకుంటూ అమరుల సమస్మరణ వారోత్సవాలను జరుపుకుంటునట్టు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత పాశవికంగా ప్రజలపై కొనసాగిస్తున్న ఆపరేషన్ కగార్ దాడుల మధ్యన జరుపుకోంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 2024 జనవరి నుంచి ప్రారంభమైన ఆపరేషన్ కగార్‌లోనే అనతికాలంలో 160 మందికిపైగా విప్లవకారులు ప్రాణాలర్పించారన్నారు. వీరిలో 6 నెలల పాపా మొదలుకొని 60 ఏళ్ల వృద్ధుల వరకు ఉన్నారని పేర్కొన్నారు. అమరుల త్యాగాలను ఏవోబీ జోన్ వ్యాప్తంగా స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. అమరుల ఆశయ సాధన కోసం తుది శ్వాస వరకు పోరాడతామని శపథం చేశారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	92.00
లైవ్ ధర	112.00
విత్ స్కిన్	194.00
స్కిన్ లెస్	204.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

జలాశయాలకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో


కల్యాణపులోవ రిజర్వాయర్ రెండు గేట్లు ద్వారా విడుదల చేస్తున్న నీరు

- కల్యాణపులోవ రెండు గేట్లు ఎత్తి 100 క్యూసెక్కుల నీరు విడుదల

రావికమతం, జూలై 22: మండలంలో కల్యాణపులోవ జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. దీంతో రెండు గేట్లు ఎత్తి సర్పానదిలోకి వంద క్యూసెక్కుల నీటిని అధికారులు విడిచిపెడుతున్నారు. రిజర్వాయర్‌లోకి వస్తున్న ఇన్‌ఫ్లోకు అనుగుణంగా నీటిని విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ ఏఈ సత్యనారాయణదొర తెలిపారు. జలాశయం గరిష్ఠ నీటి మట్టం 460 అడుగులు కాగా సోమవారం నాటికి 459 అడుగులకు నీటి మట్టం పెరిగిందన్నారు. రిజర్వాయర్ ఎగువన విస్తారంగా కురుస్తున్న వర్షాలకు ఇన్‌ఫ్లో 75 క్యూసెక్కుల మేర జలాశయంలోకి వస్తుండడంతో రిజర్వాయర్ నీటి మట్టం పెరుగుతూ వస్తుందన్నారు. ఇప్పటి వరకు నాలుగు సార్లు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశామన్నారు. సోమవ్వారం సాయంత్రం రెండు గేట్లు ఎత్తి వంద క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టామన్నారు. సర్పానది ప్రవహించే మూడు మండలాల గ్రామాల ప్రజలను అప్రమత్తంగా చేశామన్నారు.

పెద్దేరు జలాశయం నీరు విడుదల


పెద్దేరు జలాశయం గేట్లు ఎత్తి నీటిని విడిచిపెట్టిన దృశ్యం

మాడుగుల రూరల్, జూలై 22: పెద్దేరు జలాశయానికి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. రిజర్వాయర్‌లోకి 500 క్యూసెక్కులు నీరు చేరుతోంది. దీంతో పెద్దేరు జలాశయం నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరువైంది. జలాశయం గరిష్ఠ నీటి మట్టం 137 మీటర్లు కాగా ప్రస్తుతం 136.40 మీటర్లకు చేరుకుంది. ఇన్‌ఫ్లో 500 క్యూసెక్కులు వస్తుండడంతో జలాశయం అధికారులు అప్రమత్తమై ఆదివారం రాత్రి తొమ్మిది గంటల తర్వాత జలాశయం మూడు గేట్లు తెరిచి 585 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టారు. సోమవారం ఉదయం గేట్లను మూసేశారు. కాగా సోమవారం సాయంత్రానికి 500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో నీటి మట్టం 136.45 మీటర్లకు చేరిందని, రాత్రికి మరో 500 క్యూసెక్కుల నీటిని విడిచిపెడతామని ఏఈ సుధాకర్ రెడ్డి తెలిపారు. పెద్దేరు నదీ ప్రవాహ సమీప గ్రామాల వారు అప్రమత్తంగా ఉండాలని, నదీ ప్రవాహంలో దిగరాదని సూచించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- కలెక్టర్ విజయకృష్ణన్


అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

తుమ్మపాల, జూలై 22: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ప్రతి అర్జీ పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎస్‌వీఎస్ సుబ్బలక్ష్మి, రమామణి, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యం

- ఎస్పీ ఎం.దీపిక



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ ఎం.దీపిక

తుమ్మపాల, జూలై 22: బాధితులకు న్యాయం చేకూర్చడమే లక్ష్యంగా సిబ్బంది పనిచేయాలని ఎస్పీ ఎం.దీపిక ఆదేశించారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆయా సమస్యలపై పోలీస్‌శాఖకు 37 ఫిర్యాదులు అందాయని చెప్పారు. అందులో ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, చీటింగ్ వంటి ఫిర్యాదులు అందాయన్నారు. ఫిర్యాదులను చట్టపరిధిలో సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, ఎస్ఐ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

రూ.25 లక్షల విలువైన మొబైల్ ఫోన్లు రికవరీ

- బాధితులకు అందజేత

అనకాపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అపహరణకు గురైన రూ.25 లక్షల విలువైన 176 మొబైల్ ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు. వీటిని బాధితులకు ఎస్పీ ఎం.దీపిక సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 3,500 మంది మొబైల్స్ పోయిన వారు మొబైల్ మిస్సింగ్ పోర్టల్‌కు ఫిర్యాదులు చేయగా, ఆరు విడతల్లో 1,756 మొబైల్ ఫోన్‌లను రికవరీ చేసి వారికి అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ విజయభాస్కర్ (అడ్మిన్), తదితరులు పాల్గొన్నారు.


మొబైల్ ఫోన్‌ను బాధితురాలికి అందిస్తున్న ఎస్పీ ఎం.దీపిక. చిత్రంలో ఏఎస్పీ విజయభాస్కర్, తదితరులు

వరి నారుమడుల్లో సస్యరక్షణ చేపట్టాలి

- జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు

తుమ్మపాల, జూలై 22: వరి నారుమడుల్లో రైతులు సస్యరక్షణ చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి డి. మోహనరావు సూచించారు. సోమవారం తుమ్మపాలలో నీట మునిగిన వరి నారుమడులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలు రైతులకు మేలు చేకూరుస్తాయన్నారు. అయితే ఇప్పటికే రైతులు వేసిన ఎద చేనులు నీట మునిగాయని, తక్షణమే రైతులు నీటిని తొలగించే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. నీటిని తొలగించిన తరువాత వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తూ పలు రకాల ఎరువులు చల్లుకున్నట్టయితే పంట ఆరోగ్యవంతంగా ఉంటుందన్నారు. ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు జిల్లా వ్యాప్తంగా దాదాపు 230 ఎకరాల్లో నారుమడులు ముంపునకు గురయ్యాయని గుర్తించామన్నారు. ఈ ఏడాది జూలై నెల వరకు సరైన వర్షాలు లేకపోవడంతో రైతులు విత్తనాలు చల్లుకోలేదన్నారు. దీంతో ఆలస్యంగా విత్తనాలు చల్లడంతో పెద్దగా పంట నష్టం వాటిల్లే అవకాశం లేదన్నారు. అయితే కురుస్తున్న వర్షాలకు జిల్లాలో రాంబిల్లి, ఎస్.రాయవరం, కోటపాడు, రోలుగుంట, బుచ్చెయ్యపేట మండలంతో పాటు శారదానది పరివాహక ప్రాంత రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనకాపల్లి డివిజన్ పరిధిలో అనకాపల్లి మండలం, కశింకోట, మునగపాక మండలాల రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ కురిసిన వర్షాల కారణంగా రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామన్నారు. రైతులకు అధికారులు ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నట్టు చెప్పారు. మరో 24 గంటలు వర్షాభావ పరిస్థితులున్నట్టు సమాచారం ఉండడంతో పరిస్థితులను సమీక్షిస్తున్నామని చెప్పారు. ఆయా శాఖల అధికారుల సమన్వయంతో ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ ఎం.రామారావు, మండల వ్యవసాయాధికారి వి. రంగాచారి, ఇరిగేషన్ జేఈ హనుమంతరావు, తుమ్మపాల పంచాయతీ ఈవో ఈశ్వరరావు, సర్పంచ్‌లు తట్టా పెంటయ్యనాయుడు, రామకృష్ణ, గ్రామ నాయకులు కర్రి బాబీ, పీలా బుజ్జి, కోన అప్పారావు, పీలా విశ్వేశ్వరరావు, పెతకంశెట్టి బలరాం, పంచదార్ల కన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

7న జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నిక

- నోటిఫికేషన్ జారీచేసిన ఇన్‌చార్జి కమిషనర్ హరీంధిర ప్రసాద్
- 30 వరకూ నామినేషన్ల స్వీకరణ

విశాఖపట్నం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నిక వచ్చే నెల ఏడున నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ హరీంధిర ప్రసాద్ సోమవారం నోటిఫికేషన్ జారీచేశారు. స్టాండింగ్ కమిటీ పది మంది సభ్యులను 97 మంది కార్పొరేటర్లు ఎన్నుకోవలసి ఉంటుంది. సోమవారం నుంచి ఈనెల 30వ తేదీ వరకూ ఉదయం 11 నుంచి మూడు గంటలు వరకూ జీవీఎంసీ కార్యదర్శి కార్యాలయంలో నామినేషన్ల పత్రాలు అందుబాటులో ఉంచుతారు. పూర్తిచేసిన నామినేషన్ పత్రాలను ఈనెల 30లోగా అదనపు కమిషనర్ (జనరల్) కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది. ఆదేరోజు సాయంత్రం ఐదు గంటలకు నామినేషన్ల జాబితాను ప్రచురిస్తారు. 31న ఉదయం 11 గంటల నుంచి నామినేషన్ల పరిశీలన, ఆదేరోజు సాయంత్రం అనుమతించిన నామినేషన్ల ప్రచురణ జరుగుతుంది. మూడో తేదీ మధ్యాహ్నం మూడు గంటల వరకూ నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. అదే రోజు సాయంత్రం పోటీలోఉన్న అభ్యర్థుల జాబితాను ప్రచురిస్తారు. ఏడో తేదీ ఉదయం పది నుంచి మధ్యాహ్నం రెండు గంటలు వరకూ జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని పాత కౌన్సిల్‌హాలులో పోలింగ్ జరుగుతుంది. అదేరోజు సాయంత్రం ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన ఉంటుంది.

వరి నారుమడుల్లో సస్యరక్షణ తప్పనిసరి

అనకాపల్లి అగ్రికల్చర్, జూలై 22: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరి పైరుకు పొడ తెగులు ఆశించే అవకాశం ఉన్నందున రైతులు తగిన సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఆర్ఏఆర్ఎస్ సస్య రక్షణ విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కేవీ రమణమూర్తి సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వరి నారు చనిపోవడం ప్రారంభమైనా, ఎండిపోతున్నా 2 మిల్లీ లీటర్ల ఎక్సాకొనజోల్ మందు లీటరు నీటికి కలిపి ఒకసారి పిచికారీ చేయాలని చెప్పారు. నారు నీట మునిగి ఉన్నట్టయితే నీటిని తొలగించి 2 కిలోల యూరియా, ఒక కిలో పొటాష్‌లను 5 సెంట్ల నారుమడిలో చల్లాలని, జింకు లోపాన్ని గమనిస్తే 2 మిల్లీ లీటర్ల జింకు సల్ఫేట్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఇనుపధాతు లోపం ఉంటే నారు ఎర్రబారుతుందని, దీని నివారణకు 20 గ్రాముల అన్నబేదీని లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

ఇందేశమ్మ ఘాట్ రోడ్డు గోతులమయం



కోటవురట్ల, జూలై 22: మండలంలోని ఇందేశమ్మ ఘాట్ రోడ్డు గోతులతో అధ్వానంగా ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గోతుల్లో నీరు చేరి వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ రహదారికి నామమాత్రంగా మరమ్మతులు చేరి వదిలేశారు. ప్రస్తుతం ఈ మార్గంలో ప్రయాణించాలంటే వాహనచోదకులు బెంబేలెత్తిపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రహదారికి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.


అధ్వానంగా ఉన్న ఇందేశమ్మ ఘాట్ రోడ్డు

పడకేసిన సీలేరు జల విద్యుత్కేంద్రం

- ప్రస్తుతం నాలుగో వంతే ఉత్పత్తి
- సాంకేతిక లోపాలతో మూడు యూనిట్లు నిలిపివేత
- నీటి వనరులు పుష్కలంగా ఉన్నా ఒక్క యూనిట్ ద్వారా మాత్రమే విద్యుత్ ఉత్పత్తి


సీలేరు జలవిద్యుత్ కేంద్రం

సీలేరు, జూలై 22: అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం గుంటవాడ జలాశయంలో నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ సీలేరు విద్యుత్ కేంద్రంలో కేవలం ఒక్క యూనిట్ ద్వారా మాత్రమే విద్యుదుత్పత్తి జరుగుతుంది. సీలేరు జల విద్యుత్ కేంద్రంలో 240 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం (ఒక్కొక్కటి 60 యూనిట్లు) గల నాలుగు యూనిట్లు ఉండగా ప్రస్తుతం ఒక్కటి మాత్రమే పనిచేస్తోంది. సీలేరు జల విద్యుత్ కేంద్రంలో మొదటి దశలో నిర్మించిన ఒకటి, రెండు (రెండు యూనిట్లు) యూనిట్లు 50 సంవత్సరాలకు పైబడినవి కాగా, మిగతా మూడు, నాలుగు యూనిట్లు 30 సంవత్సరాలకు పైబడినవి. యూనిట్ల జీవన కాలపరిమితి (లైఫ్ టైమ్) మించడంతో ఇటీవల తరచుగా మరమ్మతులకు గురవుతూ మొరాయిస్తున్నాయి. మొదటి యూనిట్‌లో స్టాటర్ ఎర్త్ సమస్యతో 40 రోజుల క్రితం ఉత్పత్తి నిలిచిపోయింది. ఈ యూనిట్‌కు ఏడాది క్రితం పూర్తి ఓవర్‌హాలింగ్ నిర్వహించినప్పటికీ కొద్దిరోజులకే మళ్లీ స్టాటర్ ఎర్త్ సమస్య రావడంతో పనులు నిర్వహించిన కంపెనీపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. అలాగే రెండో యూనిట్ కూడా ప్రస్తుతం వినియోగంలో లేదు. వారం క్రితం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గల బస్‌బార్ల నుంచి నీరు లోపలకు ప్రవేశించి ఎర్త్ సమస్య తలెత్తడంతో నాలుగో నంబర్ యూనిట్‌లో కూడా విద్యుదుత్పత్తి నిలిచిపోయింది. ప్రస్తుతం మూడో యూనిట్‌లో మాత్రమే విద్యుదుత్పత్తి జరుగుతోంది. ఈ ప్రాంతంలో కురుస్తున్న భారీవర్షాలకు గుంటవాడ జలాశయంలోకి పుష్కలంగా నీరు చేరినప్పటికీ విద్యుత్ ఉత్పత్తి చెయ్యడానికి యూనిట్లు అందుబాటులో లేవు. స్థానిక జెన్‌కో అధికారులు నాలుగో యూనిట్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు బస్‌బార్‌లలోకి నీరు లీక్ కాకుండా కాంక్రీట్ పనులు, గ్రౌటింగ్ పనులు చేసినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. మరోపక్క జలాశయంలో నీటి నిల్వలు రోజురోజుకీ పెరిగిపోతుండడంతో నీటిని దిగువకు వృథాగా వదిలి పెట్టాల్సి వస్తోందని జెన్‌కో అధికారులు అంటున్నారు. ఏదిఏమైనప్పటికీ సీలేరు కాంప్లెక్సులో యూనిట్ల నిర్వహణ పనులను సరైన సంస్థలకు అప్పగించకపోవడం వల్లనే తరచూ సాంకేతిక లోపాలు తలెత్తుతున్నాయని పలు విమర్శలు తలెత్తుతున్నాయి.

జిల్లా స్థాయి తైక్వాండో టోర్నీలో ప్రతిభ

ఎలమంచిలి, జూలై 22: విశాఖ జిల్లా గాజువాక నడుపూరు ఉక్కు కళా వేదికలో జరిగిన 34వ జూనియర్, సీనియర్ జిల్లా స్థాయి తైక్వాండో టోర్నీలో ఎలమంచిలి క్రీడాకారులు 8 బంగారు పతకాలు సాధించినట్టు తైక్వాండో కోచ్ నగిరెడ్డి సత్యనారాయణ తెలిపారు. ఆదివారం జరిగిన ఈ టోర్నీలో ఎలమంచిలి సత్య స్పోర్ట్సు అకాడమీకి చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబరిచారన్నారు. భవ్యశ్రీ, ఎం.హర్షిత, జయశ్రీ, వి.సౌజన్య, గాయత్రి, టి.శ్వేత, ఎన్.మోహిత్, అరుణ్‌కుమార్‌లు బంగారు పతకాలు సాధించినట్టు తెలిపారు. వుడా నందకృష్ణ, విష్ణువర్ధన్‌లు రజిత పతకాలు సాధించినట్టు తెలిపారు.

గరీబ్‌రథ్‌కు ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు

- అదనంగా అందుబాటులోకి 117 థర్డ్ ఏసీ బెర్తులు

విశాఖపట్నం, జూలై 22: విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ వెళ్లే గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ (12739) మంగళవారం కొత్త ఆధునిక ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో బయలుదేరనుంది. ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్) రేక్ స్థానంలో లింక్ హాఫ్‌మన్ బుష్ (ఎల్‌హెచ్‌బీ) కోచ్‌లతో సోమవారం సికింద్రాబాద్‌లో బయలుదేరిన గరీబ్‌రథ్ మంగళవారం ఉదయం విశాఖ చేరుకోనున్నది. ఇక్కడ నుంచి రాత్రి 8.40 గంటలకు తిరిగి సికింద్రాబాద్ బయలుదేరనున్నది. ఇప్పటివరకూ 17 థర్డ్ ఏసీ, రెండు జనరేటర్ మోటారు కోచ్‌లతో కలిపి 19 కోచ్‌లతో (ఐసీఎఫ్ రేక్) రాకపోకలు సాగించిన గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్..మంగళవారం నుంచి 18 థర్డ్ ఏసీ ఎకానమీ ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో నడవనుంది. గతంలో కోచ్‌కు 81 బెర్తులు చొప్పున 17 కోచ్‌లకుగాను 1,377 థర్డ్ ఏసీ బెర్తులు అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం ఎల్‌హెచ్‌బీ రేక్ ద్వారా కోచ్‌కు 83 చొప్పున 18 కోచ్‌లకుగాను 1,494 బెర్త్‌లు అందుబాటులోకి వచ్చాయి. గతంకంటే మరో 117 బెర్తులు జత కానున్నాయి. ఇప్పటివరకూ ఐసీఎఫ్ రేక్‌తో నడిచిన గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌లో సైడ్ విండో మిడల్ బెర్తులు ఉండేవి. ఇరుకుగా ఉండే ఈ బెర్తు చిన్న పిల్లలకు మినహా మిగిలిన వారికి సౌకర్యకరంగా ఉండేది కాదని అభిప్రాయాలున్నాయి. తప్పనిసరి పరిస్థితులలో ఇబ్బందికరంగా ప్రయాణించేవారు. సైడ్ మిడిల్ బెర్తులను తొలగించాలని ప్రయాణికులు రైల్వే శాఖకు విజ్ఞప్తి చేసిన సందర్భాలున్నాయి. ఈ నేపథ్యంలో కొత్త ఆధునిక ఎల్‌హెచ్‌బీ కోచ్‌లలో సైడ్ విండో మిడిల్ బెర్తు తొలగించారు.



కొత్తూరు వద్ద పాత వంతెనను ఆనుకొని జోరుగా ప్రవహిస్తున్న మేజర్ శారదా నది

ఉరకలేస్తున్న మేజర్, మైనర్ 'శారదా'

- కొన్నిచోట్ల గట్లు బలహీనంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన
- ఉన్నతాధికారులు స్పందించి ముందస్తు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి



నారాయణపురం వద్ద గట్టును ఆనుకొని ప్రవహిస్తున్న మైనర్ శారదానది

రాంబిల్లి, జూలై 22 : తుఫాన్ ప్రభావం కారణంగా గత నాలుగైదు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో మండలంలోని ప్రధాన మేజర్, మైనర్ శారదా నదులు ఉరకలేస్తున్నాయి. కొత్తూరు వద్ద మేజర్ శారదా నది పాతవంతెనను ఆనుకొని ప్రవహిస్తుండగా, నారాయణపురం వద్ద మైనర్ శారదా నది కూడా నదిపై ఉన్న రోడ్డు అంచును ఆనుకొని పారుతోంది. నదుల గట్లు బలహీనంగా ఉండడంతో ఆయా గ్రామాల ప్రజలు, రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు వెంటనే గట్లను పరిశీలించి ముందస్తు చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతున్నారు. ఇదిలావుంటే, వర్షాల వల్ల పలు గ్రామాల్లో పొలాలు చెరువును తలపిస్తున్నాయి. దీంతో రైతులు అప్రమత్తమై నీటిని తరలించే పనుల్లో నిమగ్నమయ్యారు.

వీడని వానలతో జనం అవస్థలు



ఎలమంచిలి పట్టణంలో వర్షం కురుస్తున్న దృశ్యం

ఎలమంచిలి, జూలై 22 : అల్పపీడనం కారణంగా గత ఐదారు రోజులుగా ముసురు వాతావరణం వీడడం లేదు. సోమవారం ఎలమంచిలి మండలంలో కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాల్లో ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయింది. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో మురుగులో వర్షపునీరు కలిసి పలుచోట్ల రోడ్లపై ప్రవహించింది. సాగునీటి కాలువలు, చెరువులు, బావుల్లో వృద్ధిగా నీరు చేరింది. కొన్నిచోట్ల పొలాలు నీటమునగడంతో ఆయా రైతులు ఆందోళన చెందుతున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉండడంతో ప్రజారోగ్య శాఖ అధికారులు అప్రమత్తం కావాలని పలువురు కోరుతున్నారు.

పట్టణం అంధకారమయం

- వీధి దీపాలు వెలగక చీకట్లు
- పట్టించుకోని అధికారులు



పట్టణంలోని రంగావారి వీధిలో వీధి లైట్లు వెలగకపోవడంతో చీకటిగా ఉన్న దృశ్యం

ఎలమంచిలి, జూలై 22: ఎలమంచిలి మునిసిపాలిటీలో పలు చోట్ల వీధి దీపాలు వెలగకపోవడంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో పలుమార్లు కౌన్సిల్ సమావేశంలో పాలకవర్గ సభ్యులు ఈ సమస్యను లేవనెత్తినా పట్టించుకున్న పాపాన పోలేదు. ఆదివారం రాత్రి ప్రధాన జంక్షన్ వైఎస్సార్ విగ్రహంజంక్షన్ వద్ద వీధిలైట్లు కూడా వెలగకపోవడంతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. గత వారం రోజులుగా రంగావారి వీధిలో వీధిలైట్లు వెలగకపోవడంతో తీవ్రఇబ్బందులకు గురవుతున్నామని స్థానికులు వాపోతున్నారు. వీధిలైట్లు వెలగకపోవడంతో రాత్రి సమయాల్లో అచ్యుతాపురం పరిశ్రమల్లో విధులు ముగించుకుని ఇళ్లకు వెళ్లే వందలాది మంది మహిళా కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

దారి ఘోరం

... 5వ పేజీ తరువాయి

పాపయ్యపాలెం, సంతపాలెం, వెంకుపాలెం, సీతానగరం, తగరంపూడి, మెట్టపాలెం తదితర గ్రామాల్లో ప్రజలు అనకాపల్లి పట్టణానికి రాకపోకలు సాగించాలంటే ఈ రోడ్డే దిక్కు. అనకాపల్లి కేంద్రంగా జిల్లా ఏర్పడడంతో చోడవరం, కోటపాడు, దేవరాపల్లి, బుచ్చెయ్యపేట, మాడుగుల, రావికమతం, ఘాట్‌రోడ్డు, చీడికాడ తదితర మండలాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు ఆయా పనుల మీద రాకపోకలు సాగిస్తుంటారు. జిల్లా ప్రధాన కార్యాలయాలు అనకాపల్లిలో ఉండడంతో ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు అధ్వానంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సుమారు ఐదు కిలోమీటర్ల మేర రోడ్డు అధ్వానంగా మారింది. ఈ మార్గంలో ప్రయాణించాలంటే వాహనచోదకులు బెంబేలెత్తిపోతున్నారు. గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం ఈ రహదారి మరమ్మతులకు చర్యలు తీసుకోలేదని, కూటమి ప్రభుత్వమైనా ఈ రహదారిపై గోతులను పూడ్చాలని వాహనచోదకులు కోరుతున్నారు.

సవాళ్లు అనేకం

... 5వ పేజీ తరువాయి

అదేబాటలో ఉన్నారు. ఈ నేపథ్యంలో స్టాండింగ్ కమిటీలోని పది స్థానాలను కూటమి దక్కించుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. ఇదే సమయంలో మేయర్ వైసీపీకి చెందిన వ్యక్తి కావడంతో కౌన్సిల్ సమావేశం కూడా రసాభాసగా జరిగే అవకాశం ఉంది. వీటన్నింటినీ అధిగమిస్తూనే నగర అభివృద్ధిపై కమిషనర్ దృష్టిసారించాల్సి ఉంటుంది. కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించబోతున్న సంపత్‌కుమార్ నగరంలో పరిస్థితులను అవగాహన చేసుకుంటూనే కౌన్సిల్‌లో రాజకీయ పార్టీలను సమన్వయం చేసుకుని నగరాభివృద్ధికి ప్రణాళికల రూపకల్పన, వాటి అమలు, జీవీఎంసీ ఆదాయం పెంచడానికి కృషిచేయాల్సి ఉంటుంది.

ఆదిలోనే అన్నదాతకు సమస్య

- వర్షాల కారణంగా పలు చోట్ల నీటమునిగిన వరి నారుమడులు
- కొన్నిచోట్ల ఇతర పంట పొలాలు..
- ఆందోళన చెందుతున్న రైతులు
- వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు పరిశీలన.., సూచనలు



కశింకోట మండలం ఎస్.జి.పాలెంలో...



మునగపాక : వాడ్రాపల్లిలో నీటమునిగిన నారుమడులు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు



ఎస్.రాయవరం : ఉప్పరాపల్లిలో మోటారు ద్వారా పొలంలో నీటిని తోడుతున్న దృశ్యం

కశింకోట, జూలై 22 : తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు జిల్లాలోని పలు గ్రామాల్లో వరి నారుమడులు నీటమునిగాయి. ఇది చూసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖాధికారులు అప్రమత్తమయ్యారు. ఇందులో భాగంగా కశింకోట మండల వ్యవసాయాధికారిణి స్వప్న సోమవారం పలు గ్రామాల్లో పర్యటించి నీట మునిగిన మడులను పరిశీలించారు. నారుమడుల్లో ఉన్న అదనపు నీటిని రైతులు తొలగించి, చేపట్టాల్సిన చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త కె.వి.రమణమూర్తి, కృషి విజ్ఞాన కేంద్రం కొండెంపూడి శాస్త్రవేత్త రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి : అధిక వర్షాలకు పంటలు దెబ్బతినకుండా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.భవానీ సూచించారు. సోమవారం వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం మండలంలోని నక్కపల్లి, కాగిత, పెదదొడ్డిగల్లు గ్రామాల్లో పర్యటించి వరి నారుమడులను పరిశీలించారు. పంటలను రక్షించుకునేందుకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సి యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బీసీటీ కేవీకే కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.శైలజతో పాటు పలువురు వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఏవో ఉమాప్రసాద్, గ్రామ వ్యవసాయ సహాయకులు సాయికుమారి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

కోటవురట్ల : వర్షాల కారణంగా నీటమునిగిన వరి నారుమడులను అనకాపల్లి వ్యవసాయశాస్త్ర వేత్తలు డాక్టర్ భవానీ, హరిపురం బీసీటీ కో-ఆర్డినేటర్ డాక్టర్ శైలజా, ఏడీఏ ఉమాప్రసాద్ పరిశీలించారు. యండపల్లి, జల్లూరు గ్రామాలను సందర్శించి పొలాలను పరిశీలించి, ఆయా రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి సరోజిని తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం, జూలై 22 : వర్షాల కారణంగా ఎలమంచిలి వ్యవసాయ డివిజన్‌లో నీట మునిగిన పలు పొలాలను కొక్కిరాపల్లి పరిశోధన కేంద్రానికి చెందిన శాస్త్రవేత్తల బృందం సోమవారం సందర్శించింది. ఇందులో భాగంగా ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎంబీజీఎస్ కుమారి ఆధ్వర్యంలో శాస్త్రవేత్త డాక్టర్ ఏబీఎం, వ్యవసాయ సహాయ సంచాలకుడు ప్రభాకర్, ఏవో సౌజన్యలు ఉప్పరాపల్లిలో నారుమడులను పరిశీలించారు. మడులలోని నీటిని తొలగించే విధానాన్ని వారు రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీరాములు, వీపీఏలు దినకర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలి : అల్పపీడనం కారణంగా కురిసిన వర్షాలకు ఎలమంచిలి వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని పలు గ్రామాల్లో నీట మునిగిన పొలాలను సోమవారం శాస్త్రవేత్తల బృందం, స్థానిక వ్యవసాయాధికారులు కలిసి పర్యటించారు. ప్రస్తుతం పంట పొలాలు ఎలా ఉన్నాయో చూసి రైతులకు సూచనలు చేశారు. కొక్కిరాపల్లి సేద్య విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎంబీజీఎస్ కుమారి ఆధ్వర్యంలో వ్యవసాయ ఉప సంచాలకులు ప్రభాకర్, ఏవో మోహన్‌రావులు కలిసి ఎలమంచిలి, జంపపాలెం, తురంగలపాలెం, కొక్కిరాపల్లి, సోమలింగపాలెం, గొల్లలపాలెం గ్రామాల్లోని పంట పొలాలను పరిశీలించారు. ముందుగా పొలాల్లో చేరిన వర్షపు నీటిని తొలగించాలన్నారు. ఆ తరువాత యూరియా ఒక కేజీ మ్యురేట్ ఆఫ్ పోటాష్ ఒర కేజీ ఐదు సెంట్లు నారుమడికి వేసుకోవాలని రైతులకు వివరించారు. అనంతరం పంట దశల వారీగా ఏఏ జాగ్రత్తలు తీసుకోవాలో వారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ రైతులతో పాటు గ్రామ వ్యవసాయ విస్తరణాధికారులు పాల్గొన్నారు.

రాంబిల్లి : మండలంలోని దిమిలి, మురకాడ, పంచదార్ల గ్రామాల్లో ముపునకు గురైన పొలాల్లోని వరి ఆకుమడులను సోమవారం శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు పరిశీలించారు. కొక్కిరాపల్లి వ్యవసాయ పరిశోధనా స్థానం సేద్యవిభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కుమారి సదరు పొలాలను పరిశీలించి రైతుకలు పలు సూచనలు చేశారు. శాస్త్రవేత్తల బృందంతోపాటు రాంబిల్లి, ఎలమంచిలి, ఎస్.రాయవరం వ్యవసాయాధికారులు మోహన్, సుమంత, సౌజన్య, వ్యవసాయ విస్తరణాధికారులు పాల్గొన్నారు.

మునగపాక (తుమ్మపాల) : నారుమడుల్లో నీటి నిల్వలను తొలగించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు కేవీ రమణమూర్తి, బి.రాజ్ కుమార్ సూచించారు. సోమవారం మునగపాక మండలంలోని వాడ్రాపల్లిలో నీట మునిగిన నారు మడులను వ్యవసాయాధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు విజేత, ఎం.లక్ష్మి, సీహెచ్. జ్యోత్స్నకుమారి, సింధూజా, రవి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయంలో 1001 కలశాలతో పూజలు



కలశాలతో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

అనకాపల్లి టౌన్, జూలై 22 : పట్టణంలోని దేమునిగుమ్మం వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి పవిత్రోత్సవాలు నేత్రపర్వంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం రాత్రి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పులకండం గిరిబాబు, విజయబాబు ఆధ్వర్యంలో వేదపండితులు ఆలయ మండపంలో 1001 లోకోత్తర సహస్ర కలశాలతో, 108 అష్టోత్తర కలశాలతో పూజలు జరిపారు. ఈ సందర్భంగా అన్నమాచార్య వాగ్గేయ వరదాయిని, గౌరీ అన్నమాచార్య బృందం ఆలపించిన సంకీర్తనలు, శాస్త్రీయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ఈవో రాజ సులోచన, పర్యవేక్షకులు సకల గోవిందరావు, పులకండం ప్రసాద్‌బాబు, రాజేష్‌బాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

'వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి'

అనకాపల్లి టౌన్, జూలై 22 : జిల్లాలో నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు, ఇళ్లు కోల్పోయిన ప్రజలకు పరిహారం అందించాలని సీపీఎం జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. సోమవారం ఇక్కడ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడారు. ఏప్రిల్ నుంచి సముద్రంలో చేపల వేట నిషేధం అమలులో ఉన్నందున మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వారికి ఇవ్వాల్సిన జీవన భృతి తక్షణమే ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లాలో జ్వరాలు విజృంభిస్తున్నాయన్నారు. జ్వరాల నియంత్రణకు చర్యలు తక్షణమే చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు జి.కోటేశ్వరరావు, ఎం.అప్పలరాజు, ఆర్. శంకరరావు, వీవీ శ్రీనివాసరావు, గంటా శ్రీరామ్, గనిశెట్టి సత్యనారాయణ, అల్లు రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం : జెడ్సీ



అర్జీదారుడితో మాట్లాడుతున్న జెడ్సీ అయ్యప్పనాయుడు

అనకాపల్లి టౌన్, జూలై 22 : ఇక్కడి జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. వివిధ వార్డుల నుంచి ప్రజలు వచ్చి సమస్యలపై అర్జీలను అందజేశారు. ప్రతి ఒక్కరితో జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. నరసింగరావుపేటలో ఆక్రమణలు తొలగించాలని వియ్యపు శ్రీనివాస యాదవ్ కోరారు. లక్ష్మీదేవిపేటలో ఉన్న పురాతన భవనంలో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయని, వాటి వల్ల విష సర్పాల భయం వెంటాడుతోందని ఎం.కొండలరావు అనే వ్యక్తి వివరించారు. అలాగే, మరికొంత మంది సమస్యలను విన్నవించారు. వీటిని ఆయా విభాగాలకు పంపి, పరిష్కరించాలని జెడ్సీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

'గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తం కండి'



తాగునీటిని పరీక్షిస్తున్న ప్రత్యేకాధికారిణి కిరణ్‌కుమారి

సబ్బవరం, జూలై 22 : గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేకాధికారిణి పీఎల్ఎన్ కిరణ్‌కుమారి సూచించారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం వివిధ శాఖల అధికారులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున డెంగ్యూ, డయేరియా, మలేరియా, టైఫాయిడ్ వంటివి ప్రబలే అవకాశం ఉందన్నారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ పక్కా చేపట్టాలన్నారు. రక్షిత మంచినీటి పథకాల ట్యాంకును క్లోరినేషన్ చేయాలని, తాగునీటిని ఎప్పటికప్పుడు పరీక్షించాలని వివరించారు. అన్ని వ్యాధుల నివారణకు అవసరమైన మందులను సిద్ధం చేసి ఉంచుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చక్రవర్తికి ఆమె సూచించారు. ఎంపీడీవో రామ్మోహన్‌రావు, ఈవోపీఆర్డీ మహేశ్, ఏవో పోతల సత్య నారాయణ, ఏఈలు అర్జున అప్పారావు, హిమబిందు, రామలక్ష్మణ, ఏపీఎం సాయి రమేశ్, కార్యదర్శి మూర్తిబాబు పాల్గొన్నారు.

ఘనంగా జన్యుశాస్త్ర పితామహుడి జయంతి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

ఎలమంచిలి, జూలై 22 : పట్టణంలోని గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జన్యుశాస్త్ర పితామహుడు గ్రెగర్ జోహాన్ మెండల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ జన్యుశాస్త్రం ఆవిర్భావానికి మెండల్ చేసిన కృషిని వివరించారు. అనంతరం గుజరాత్‌లోని బార్డోలీలో ఉన్న ఉకా టర్సాడియా విశ్వవిద్యాలయం బయోటెక్నాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.నాగరత్న సుప్రియ మాట్లాడుతూ జన్యుశాస్త్రానికి సంబంధించిన పలు అంశాలను విద్యార్థులకు తెలియజేయడంతో పాటు వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ అర్జున అప్పారావు, కె.సుజాత, విజయలక్ష్మి, తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మొబైల్ ఆధార్ శిబిరాలు

అచ్యుతాపురం రూరల్, జూలై 22 : మండలంలోని ఐదు గ్రామాల్లో మంగళవారం నుంచి ఐదురోజుల పాటు సంచార ఆధార్ శిబిరాలను నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. దోసూరు, పూడిమడక, హరిపాలెం, ఎం.జగన్నాధపురం, వెదురువాడ సచివాలయాల్లో ఏర్పాటు కానున్న ఈ శిబిరాలను అంతా సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

శ్మశానవాటిక ఆక్రమణపై ఫిర్యాదు

మునగపాక (తుమ్మపాల), జూలై 22 : మునగపాక మండలం నాగులాపల్లిలో గల దళితుల శ్మశానవాటిక ఆక్రమణను అడ్డుకోవాలని గ్రామ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు నీలపల్లి నరసింహరాజు తదితరులు మాట్లాడుతూ దళితుల శ్మశానవాటికను కొంతమంది అన్యాయంగా ఆక్రమించి లేఅవుట్‌లు వేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే 15 అడుగుల రోడ్డు వేసి అమ్మకాలు సాగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. తక్షణమే అధికారులు విచారణ చేపట్టి, బాధ్యుల పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

దుర్గాదేవి విగ్రహం అపహరణపై ఫిర్యాదు

రాంబిల్లి, జూలై 22: మండలంలోని గోవిందపాలెం గ్రామంలో దుర్గమ్మ ఆలయంలో ఆదివారం రాత్రి దుర్గమ్మ ఇత్తడి విగ్రహం, అమ్మవారి హుండీలోని కానుకలు చోరీకి గురయ్యాయని ఆ గ్రామ పెద్దలు సోమవారం రాంబిల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు నెలల క్రితం అమ్మవారి జాతర సందర్భంగా అమ్మవారి ఆలయంలో పంచలోహాలతో చేయించిన దుర్గాదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. సోమవారం ఉదయం అమ్మవారి ఆలయాన్ని శుభ్రం చేసేందుకు వెళ్లిన భక్తులకు విగ్రహం కనిపించకపోవడంతో పాటు హుండీ తెరిచి ఉండడంతో చోరీ జరిగినట్టు గుర్తించి గ్రామ పెద్దలకు సమాచారం ఇచ్చారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, జూలై 22: పూడిమడకరోడ్డులో ఆదివారం రాత్రి పేకాట ఆడుతున్న 10 మందిపై కేసు నమోదు చేశామని పట్టణ ఎస్ఐ వి. సత్యనారాయణ తెలిపారు. పూడిమడకరోడ్డులోని ఓ ప్రైవేటు ఆస్పత్రి మార్గంలో పేకాట ఆడుతున్న పది మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.27,680లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సోమవారం తెలిపారు.

అనకాపల్లి- కాకినాడ సర్వీసు ప్రారంభం



అనకాపల్లి టౌన్, జూలై 22 : పీటీడీ అధికారులు సోమవారం అనకాపల్లి నుంచి కాకినాడకు బస్సు సర్వీసును ప్రారంభించారు. ఇక్కడి నుంచి కదిలిన ఈ బస్సు చోడవరం వెళ్లి తిరిగి అనకాపల్లి, ఎలమంచిలి, తుని, అన్నవరం మీదుగా కాకినాడ చేరుతుందని అధికారులు తెలిపారు. అనకాపల్లి నుంచి కాకినాడకు నేరుగా బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని పలువురు ప్రయాణికులు ఇటీవల అధికారులను కోరడంతో ఈ మేరకు చర్యలు చేపట్టినట్టు చెప్పారు.

'గురుకులం'లో శిక్షా సప్తాహ్ ప్రారంభం

ఎలమంచిలి, జూలై 22 : జాతీయ విద్యా విధానం ప్రారంభించి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం ఎలమంచిలిలోని కొక్కిరాపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో శిక్ష సప్తాహ్ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలుత ప్రిన్సిపాల్ ఎం.మాణిక్యం ప్రారంభించారు. తక్కువ ధరకు ఖర్చు లేకుండా లభించిన వస్తువులతో తయారు చేసిన బోధనా సామగ్రిని ప్రదర్శించారు. గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయకర్త రూపావతి ప్రదర్శనను సందర్శించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

పరవాడలో సామాజిక తనిఖీ గ్రామసభ

పరవాడ, జూలై 22 : మేజర్ పంచాయతీ పరవాడ సచివాలయంలో సోమవారం ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు హాజరై పంచాయతీలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులను వివరించారు. ఎంపీటీసీ పైలా శ్రీనివాసరావు, మండల పరిషత్ కార్యాలయ ఏవో రాంబాబు, పంచాయతీ కార్యదర్శి అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి బీమా చెక్కు అందజేత



మృతుని భార్యకు చెక్కు అందిస్తున్న గెడ్డం బుజ్జి

పాయకరావుపేట రూరల్, జూలై 22 : పి.ఎల్.పురం గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త కంచి గణపతి గత ఏడాది జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి పార్టీ బాసటగా నిలిచింది ఈ మేరకు మృతుని భార్య కల్యాణికి రూ.ఐదు లక్షల బీమా చెక్కును పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి అందజేశారు. నాయకులు కర్రి బాబూరావు, పల్లి దుర్గ, మేడిశెట్టి కృష్ణ, శ్రీరంగం రామకృష్ణ, అబి, పిల్లి వీరబాబు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం



మృతుడి భార్యకు నగదు అందిస్తున్న స్నేహితులు

సబ్బవరం, జూలై 22 : మండలంలోని మలునాయుడుపాలెం జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. 2004-05 విద్యా సంవత్సరంలో పదో తరగతి తమతో పాటు చదివిన బొమ్మ ఆంజనేయులు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో అతని కుటుంబ సభ్యులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను గుర్తించి మిత్రులంతా కలిసి రూ.25వేలను పోగుచేశారు. ఆ మొత్తాన్ని సోమవారం సదరు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో యడ్ల నాయుడు, లావేటి రవికిరణ్, కోన గణేశ్, గండి త్రినాథ్, తుంపాల శివ, నక్కెళ్ల రామునాయుడు, గండి బాలరాజు, నేబర్తి కృష్ణ, గండి గజపతినాయుడు పాల్గొన్నారు.

శివాలయం నిర్మాణానికి విరాళాలు

సబ్బవరం, జూలై 22 : మండల కేంద్రం సబ్బవరంలో శివాలయం నిర్మాణానికి పలువురు దాతలు విరాళాలను అందజేశారు. సబ్బవరపు పైడినాయుడు సోమవారం రూ.50,116, అడిగర్ల సత్యం రూ.20,116లను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో దంగేటి నానిబాబు, బర్ల రమణ, గెడ్డం కృష్ణ, జెట్టి ప్రసాద్, టి శేఖర్, అక్కుబాబు, చింతల శ్రీను పాల్గొన్నారు.

చినదొడ్డిగల్లులో అధికారుల బృందం పర్యటన

- గ్రామంలో మురుగును తక్షణం తొలగించాలని ఆదేశం
- సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్న ప్రత్యేకాధికారి



రోడ్డుపై నిలిచిన నీటిని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి ప్రభాకరరావు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నక్కపల్లి, జూలై 22 : మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామంలో రోడ్డుపై నిచిలిచి ఉన్న మురుగునీటిని తక్షణం తొలగించాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా హార్టీకల్చర్ ఆఫీసర్ జి.ప్రభాకరరావు అధికారులను ఆదేశించారు. 'వాన కురిస్తే.. నరకమే!' శీర్షికతో సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి వెనువెంటనే స్పందించారు. ఆయన ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులు గ్రామంలో పర్యటించి బద్దివీధిలో రోడ్డుపై నిలిచిపోయిన మురుగును పరిశీలించారు. తక్షణం నీటిని తరలించేందుకు చర్యలు తీసుకోవాలని సర్పంచ్, పంచాయతీ కార్యదర్శికి సూచించారు. అదేవిధంగా గ్రామంలో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఈవోపీఆర్డీ సత్యనారాయణను ఆదేశించారు. అంతకుముందు ప్రత్యేకాధికారి నక్కపల్లిలో మండలస్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. తుఫాన్ ప్రభావం కారణంగా మండలంలో పంటల నష్టం, గృహాలు, పాఠశాలల భవనాలు తెబ్బతినడం, పారిశుధ్యం, ప్రజారోగ్యం, తాగు, సాగునీటి వనరులపై తదితరాలపై చర్చింది, తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, కార్యదర్శి రాజశేఖర్, జనసేన మండల అధ్యక్షుడు వెలగా సుధాకరరావు, తోట సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం
నియోజకవర్గం

వాటర్ ట్యాంకులను క్లోరినేషన్ చేయండి

పంచాయతీ సిబ్బందికి మండల ప్రత్యేకాధికారిణి ఆదేశం



చిక్కుడుపాలెం వద్ద ట్యాంకును పరిశీలిస్తున్న అధికారులు

నాతవరం, జూలై 22 : వర్షాలు కురుస్తున్నందున అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారిణి జీవీ లక్ష్మి సూచించారు. సోమవారం ఆమె గుమ్మిడిగొండ పంచాయతీ చిక్కుడుపాలెం, మన్యపురట్లలో ఉన్న రక్షిత తాగునీటి పథకాల ట్యాంకులను పరిశీలించారు. వర్షపు నీటి వల్ల ట్యాంకుల్లో బురద చేరకుండా ఎప్పటికప్పుడు తనిఖీలతో పాటు క్లోరినేషన్ చేస్తుండాలన్నారు. ప్రతి పంచాయతీలో పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అలాగే, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది అప్రమత్తం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట ఎంపీడీవో జె.రాంబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజేష్, పంచాయతీ కార్యదర్శులు సింహాద్రినాయుడు, జె.చినబాబు తదితరులు ఉన్నారు.

జానకిరాంపురంలో వైర్లపై కూలిన చెట్టు
- పలు గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయం



విద్యుత్ వైర్లపై పడిన చెట్టు

గొలుగొండ, జూలై 21 : మండలంలో సోమవారం కురిసిన భారీ వర్షానికి జానకిరాంపురం వద్ద విద్యుత్ వైర్లపై చెట్టుపడింది. దీంతో చీడిగుమ్మల, ఎర్రవరం, పాతమల్లంపేట, నర్సింగబిల్లి, పప్పుశెట్టిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సంబంధిత శాఖాధికారులు వెంటనే స్పందించి చెట్టును తొలగించి, వైర్లను సరిచేసి సరఫరాను పునరుద్ధరించారు.

అసలే గుంతల మయం.. వర్షాలతో మరింత భయం..

▸ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రహదారులపై తీవ్ర నిర్లక్ష్యం ▸ అస్తవ్యస్తంగా మారడంతో రాకపోకలకు వాహనదారులకు ఇబ్బందులు
▸ అల్పపీడనం కారణంగా వానలతో మరింత ఛిద్రం ▸ కనీసం మరమ్మతులైనా చేపట్టాలని వేడుకోలు

నర్సీపట్నం, జూలై 22 : అల్పపీడనం కారణంగా గత నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు రహదారులు అధ్వానంగా మారాయి. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రహదారుల అభివృద్ధిని విస్మరించడంతో ఎక్కడికక్కడ రాళ్లు తేలి, గోతులుపడ్డాయి. దీంతో రాకపోకలకు జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు గత కొద్దిరోజులుగా పడుతున్న వర్షాలకు మరింత ఛిద్రమయ్యాయి. ఇక్కడి నర్సీపట్నం- తుని రోడ్డులోని ఫైర్‌ఆఫీసు దాటినతర్వాత రోడ్డుపై పెద్దగొయ్యి ఏర్పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. బలిఘట్టం మెయిన్ రోడ్డులో కూడా రోడ్డు అధ్వానంగా తయారవ్వడంతో జీవీఆర్ యూత్ ఆధ్వర్యంలో గుంతలను పూడ్చారు. నర్సీపట్నం- చింతపల్లి రూటులో తాజా వర్షాలకు మెయిన్ రోడ్డు పూర్తి శిథిలావస్థకు చేరుకుంది. ఈ రోడ్డులో ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాల, అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాల వసతి గృహాలు, కూరగాయల మార్కెట్ ఉన్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో సెబ్ కార్యాలయం దాటిన తర్వాత రెండు చోట్ల పెద్దపెద్ద గుంతలు పడడంతో వాహనదారుల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తాత్కాలిక మరమ్మతులైనా చేపట్టాల్సిందిగా పలువురు కోరుతున్నారు.



నర్సీపట్నంలోని అర్‌అండ్‌బీ కార్యాలయానికి సమీపంలో రోడ్డుపై పడిన గుంతలు



కృష్ణాదేవిపేట- లింగంపేట మార్గంలో రోడ్డు దుస్థితి

గొలుగొండ మండలంలో..

కృష్ణాదేవిపేట, : గత నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గొలుగొండ మండలంలోని పలు రోడ్లు అధ్వానంగా మారాయి. సోమవారం ఎడతెరిపి లేకుండా ఏఎల్‌పురం, చోద్యం, కొంగసింగి, నాగాపురం, పాతకృష్ణాదేవిపేట తదితర గ్రామాల్లో భారీ వర్షం పడింది. దీంతో లింగంపేట, రామచంద్రపురం, పాతకృష్ణాదేవిపేట, కొంగసింగి, చోద్యం రహదారుల్లో పడిన గోతుల్లో నీరు చేరి వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలాగే ఏఎల్‌పురంలో జరిగిన వారపుసంత వర్షం కారణంగా బోసిపోయింది. దీంతో వ్యాపారులు తెచ్చిన కూరగాయాలు, ఇతర సమగ్రి కొనేవారు లేకపోవడంతో వారు డీలాపడ్డారు.

'నారుమడుల్లో వర్షపు నీటిని తొలగించండి'

మాకవరపాలెం, జూలై 22 : అల్పపీడనం కారణంగా గత నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు మండలాల్లో వరి నారుమడులు నీట మునిగాయి. దీంతో ఆయా రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ తరుణంలో వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు అప్రమత్తమయ్యారు. మాకవరపాలెం మండలం పైడిపాల, కొండల అగ్రహారం, మాకవరపాలెం, గిడుతూరు గ్రామాల్లోని వరి పొలాలను వ్యవసాయాధికారులతో కలిసి శాస్త్రవేత్తలు బి.భవానీ, కె.శైలజ పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఖరీఫ్ సీజన్‌కు ఎంతో మేలు చేస్తాయన్నారు. కొన్నిచోట్ల వరినారు మడులకు ఇప్పటికే తెగుళ్లు సోకే ప్రమాదం ఉందన్నారు. వీలైనంత తొందరగా నారుమడుల్లో నీటిని తొలిగించాలని వివరించారు. ఐదు సెంట్ల నారుమడికి రెండు కేజీల యూరియా, ఒక కేజీ పొటాష్ ఎరువును వేయాలన్నారు. తెగుళ్ల వచ్చే అవకాశం ఉన్నందున కార్బెండిరియా లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



వరి నారుమడులను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

పట్టణాన్ని వీడని పందుల బెడద

నర్సీపట్నం, జూలై 22 : మునిసిపాలిటీలో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. వార్డులలో వీటి సమస్య అధికంగా ఉంది. పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉండడంతో ఎక్కడికక్కడ చెత్తపేరుకుపోయి ప్రజలుఇబ్బంది పడుతున్నారు. తాజా వర్షాలకు ఖాళీ స్థలాలలో చేరిన నీటి నిల్వలు, చెత్త కుప్పలు, డంపిర్ బిన్లు వద్ద గుంపులు గుంపులుగా చేరి వాతావరణాన్ని పాడుచేస్తున్నాయి. వెంకునాయుడుపేట, రామారావుపేట, శివపురం, శారదానగర్, బ్యాంక్‌కాలనీ, ఇందిరామార్కెట్, పెదబొడ్డేపల్లి రైతుబజార్, బలిఘట్టంలో వీటి సంచారం అధికంగా ఉంది.



పోలీస్ స్టేషన్ రోడ్డులో పందుల గుంపు

వసతి గృహం వద్ద అపారిశుధ్యం తొలగించాలని వినతి

నర్సీపట్నం అర్బన్, జూలై 21 : పట్టణ శివారు గిరిజన బాలికల వసతి గృహం వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రతినిధి జి.ఫణీంద్రకుమార్ తదితరులు కోరారు. ఈ మేరకు మునిసిపల్ కమిషనర్‌కు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. వసతి గృహం విద్యార్థినులు అనారోగ్యానికి గురికాకుండా ఉండేందుకు పారిశుధ్య పనులు చేపట్టేలా ఆదేశాలు జారీ చేయాలన్నారు.



కమిషనర్‌కు వినతిని అందిస్తున్న నాయకులు

దారి ఘోరం

... 5వ పేజీ తరువాయి

పాపయ్యపాలెం, సంతపాలెం, వెంకుపాలెం, సీతానగరం, తగరంపూడి, మెట్టపాలెం తదితర గ్రామాల్లో ప్రజలు అనకాపల్లి పట్టణానికి రాకపోకలు సాగించాలంటే ఈ రోడ్డే దిక్కు. అనకాపల్లి కేంద్రంగా జిల్లా ఏర్పడడంతో చోడవరం, కోటపాడు, దేవరాపల్లి, బుచ్చెయ్యపేట, మాడుగుల, రావికమతం, ఘాట్‌రోడ్డు, చీడికాడ తదితర మండలాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు ఆయా పనుల మీద రాకపోకలు సాగిస్తుంటారు. జిల్లా ప్రధాన కార్యాలయాలు అనకాపల్లిలో ఉండడంతో ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు అధ్వానంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సుమారు ఐదు కిలోమీటర్ల మేర రోడ్డు అధ్వానంగా మారింది. ఈ మార్గంలో ప్రయాణిం చాలంటే వాహనచోదకులు బెంబేలెత్తిపోతున్నారు. గత ఐదేళ్లగా వైసీపీ ప్రభుత్వం ఈ రహదారి మరమ్మతులకు చర్యలు తీసుకోలేదని, కూటమి ప్రభుత్వమైనా ఈ రహదారిపై గోతులను పూడ్చాలని వాహనచోదకులు కోరుతున్నారు.

సవాళ్లు అనేకం

... 5వ పేజీ తరువాయి

ఆదేబాటలో ఉన్నారు. ఈ నేపథ్యంలో స్టాండింగ్ కమిటీలోని పది స్థానాలను కూటమి దక్కించుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. ఇదే సమయంలో మేయర్ వైసీపీకి చెందిన వ్యక్తి కావడంతో కౌన్సిల్ సమావేశం కూడా రసాభాసగా జరిగే అవకాశం ఉంది. వీటన్నింటినీ అధిగమిస్తూనే నగర అభివృద్ధిపై కమిషనర్ దృష్టిసారించాల్సి ఉంటుంది. కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించబోతున్న సంపత్‌కుమార్ నగరంలో పరిస్థితులను అవగాహన చేసుకుంటూనే కౌన్సిల్‌లో రాజకీయ పార్టీలను సమన్వయం చేసుకుని నగరాభివృద్ధికి ప్రణాళికల రూపకల్పన, వాటి అమలు, జీవీఎంసీ ఆదాయం పెంచడానికి కృషిచేయాల్సి ఉంటుంది.

చోడవరం
నియోజకవర్గం



బాధితులకు చెక్కు అందిస్తున్న నాగబాబు

రూ.5 లక్షల బీమా పరిహారం పంపిణీ

రోలుగుంట, జూలై 22: బలిజిపాలెం గ్రామానికి చెందిన కోలిపల్లి చిరంజీవి కుటుంబానికి రూ.5 లక్షల బీమా పరిహారం చెక్కును జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు అందజేశారు. చిరంజీవి ఆరు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. అతను జనసేన పార్టీలో క్రియాశీలక సభ్యుడిగా కొనసాగుతున్నారు. దీంతో మంగళగిరిలో నిర్వహించిన కార్యక్రమంలో చిరంజీవి భార్య శ్యామలకు రూ.5 లక్షల బీమా చెక్కును అందించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మహారాజు పాల్గొన్నారు.

పొలాల్లో నీరు తొలగించండి

రావికమతం, జూలై 22: కూరగాయల పంట పొలాల్లో నీటి నిల్వలు తొలగించాలని ఉద్యానవన శాఖాధికారి భానుపుష్పలీలావతి సూచించారు. మండలంలోని తోటకూరపాలెం, తట్టబంద, పి.పొన్నవోలు, జడ్.కొత్తపట్నం, చీమలపాడు గ్రామాలను సోమవారం సందర్శించారు. వర్షాల కారణంగా కూరగాయలు, తీగజాతి పంటల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. మొక్కల మొదళ్లలో మూడు గ్రాముల సీవోసీని లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. విస్తీర్ణం బట్టి ఈ మందు పిచికారీ చేసుకుంటే తెగుళ్లను నివారించవచ్చన్నారు. అలాగే రైతులు అనుసరించాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు.

'స్మితా సబర్వాల్ వ్యాఖ్యలు దారుణం'

చోడవరం, జూలై 23: దివ్యాంగుల రిజర్వేషన్లపై ఐఏఎస్ స్మితా సబర్వాల్ చేసిన వ్యాఖ్యలు దారుణమని వికలాంగుల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు శరగడం నాగభూషణం డిమాండ్ చేశారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం వికలాంగులకు ఆత్మస్థైర్యాన్ని కల్పించేలా ఇచ్చిన రిజర్వేషన్లను స్మితా సబర్వాల్ అవహేళన చేసేలా మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ఈ వ్యాఖ్యలపై సుప్రీం కోర్టు సుమోటోగా కేసు నమోదు చేసి చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

చురుగ్గా తాచేరు డైవర్షన్ రోడ్డు పనులు

బుచ్చెయ్యపేట, జూలై 22: తాచేరు డైవర్షన్ రోడ్డు మరమ్మతు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. భారీ వర్షాలకు డైవర్షన్ రోడ్డు గండి పడిన విషయం తెలిసిందే. దీంతో అప్రమత్తమైన అధికారులు డైవర్షన్ రోడ్డుపై రవాణా నిలిపివేశారు. అనకాపల్లి ఆర్‌అండ్‌బీ డీఈఈ ధనుంజయరావు పర్యవేక్షణలో వర్షాలను సైతం లెక్కచేయకుండా మరమ్మతు పనులు చేపట్టారు. డైవర్షన్ రోడ్డు సీసీ ఫైపులకు అంచున 500 ఇసుక బస్తాలు వేశారు. నదీ ప్రవాహం తగిన వెంటనే రవాణాను పునరుద్ధరించనున్నట్టు డీఈఈ తెలిపారు.

దివ్యాంగులకు ఫిజియోథెరిపీ సేవలు

బుచ్చెయ్యపేట, జూలై 22: దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరిపీ సేవలు అందిస్తున్నట్టు ఎంఈవో కాశీవిశ్వేశ్వరరావు చెప్పారు. మండల కేంద్రంలో సోమవారం దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరిపీ సేవలను ప్రారంభించారు. అవయవ లోపం, వెనుముక సమస్యలు ఉన్న విద్యార్థుల కోసం మండలానికి ఓ ఫిజియోథెరిపిస్టును ప్రభుత్వం నియమించిందన్నారు. ప్రతీ మంగళవారం భవిత కేంద్రంలో అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తారని ఆయన చెప్పారు.

ఎడతెరిపి లేని వర్షాలు.. నీట మునిగిన పొలాలు

చోడవరం, జూలై 22: బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో ఎడతెరిపి లేని వర్షాలు పడుతున్నాయి. మూడు రోజులుగా వాన కురుస్తూనే ఉంది. దీంతో పంట పొలాలు నీట మునిగాయి. చోడవరంలో సోమవారం మోస్తరు వర్షం పడింది. విరామం లేకుండా జల్లులు పడుతుండడంతో తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే జనం రోడ్లపైకి వస్తున్నారు. దీంతో జన సంచారం కనిపించడం లేదు.





మాడుగులలో నీట మునిగిన వరి పొలం... చీడికాడలో సరుగుడు మొక్కలను ముంచిన వర్షపు నీరు

మాడుగులలో జోరు వాన

మాడుగుల: మాడుగుల కేంద్రంలో సోమవారం ఉదయం నుంచి జోరు వాన పడింది. మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. కాగా, ఈ వర్షంతో రైతులు పంటపొలాల్లో నాట్లు వేసేందుకు దమ్ములు పట్టేపనిలో రైతులు నిమగ్నమయ్యారు. లోతట్టు ప్రాంతాలతో పాటు పంట పొలాల్లోకి నీరు చేరింది. అలాగే వర్షం కారణంగా సోమవారం వారపు సంతకు వచ్చిన వ్యాపారులు కొనుగోలుదారులు లేకపోవడంతో డీలా పడ్డారు.

చీడికాడలో మునిగిన పంట పొలాలు

చీడికాడ, జూలై 22: అల్పపీడన ప్రభావంతో మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు కారణంగా పంట పొలాల్లో నీరు చేరింది. అయితే వ్యవసాయం చేయడానికి రైతులకు గిట్టుబాటు ధర లేకపోవడంతో మెట్టు పొలాల్లో సరుగుడు పంటను ఆశ్రయించారు. నెల రోజుల క్రితం వేసిన సరుగుడు మొక్కల్లో వర్షపు నీరు చేరడంతో రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే వారం రోజుల క్రితం వరకూ వరి ఆకులకు నీరు లేక ఇబ్బందిపడిన రైతులు, ఈ తుఫాన్ వర్షాలతో వరి ఆకుమడులరు పుష్కలంగా నీరు చేరడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



చోడవరంలో కురుస్తున్న వర్షం



ఉద్యోగులకు సూచనలు ఇస్తున్న ఆర్డీవో చిన్నికృష్ణ

రాత్రి వేళల్లో అప్రమత్తంగా ఉండండి: ఆర్డీవో

బుచ్చెయ్యపేట, జూలై 22: పెద్దేరు రిజర్వాయర్ గేట్లు రాత్రి వేళలో ఎత్తి నీరు కిందకు వదలుతున్నందున అప్రమత్తంగా వ్యవహరించాలని ఆర్డీవో చిన్నికృష్ణ అధికారులను ఆదేశించారు. నీట మునిగి వడ్డాది కాజ్‌వేతో పాటు తాచేరు డైవర్షన్ రోడ్డు మరమ్మతు పనులను సోమవారం పరిశీలించారు. వడ్డాది కాజ్‌వేపై రిజర్వాయర్ నీటి ప్రవాహం కారణంగా రాత్రి సమయంలో వాహనదారులు ప్రమాదాలకు గురికాకుండా చర్యలు చేపట్టాలన్నారు. వరద నీటి ప్రవాహంలో కొటుకువస్తున్న దుంగలు, తుప్పలు వడ్డాది కాజ్‌వే పైపుల్లో చిక్కుకుపోకుండా ఎప్పటికప్పడు తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఈవో లవరాజును ఆదేశించారు. వడ్డాది ఉప సర్పంచ్ దాడి సూర్యనాగేశ్వరరావు, ఎస్ఐ డి.ఈశ్వరరావు, వీఆర్వో సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలు



వేంకటేశ్వరస్వామి ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

చోడవరం, జూలై 23: స్థానిక ఆపదహర వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి పవిత్రోత్సవాలు సోమవారం ముగిశాయి. 58 రోజుల పాటు నిర్వహించిన ఈ ఉత్సవాల్లో చివరి రోజున కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శాంతారామాచార్యులు, వేంకట లక్ష్మీనారాయణాచార్యులు, సూర్యశేషగోపాలాచార్యులు, ఈవో సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

పాఠశాలల శిథిల భవనాలపై డీఈవో ఆరా

మాడుగుల రూరల్, జూలై 22: మండలంలోని శిథిలావస్థలో ఉన్న పాఠశాలల భవనాలను జిల్లా విద్యా శాఖాధికారి వెంకటలక్ష్మమ్మ సోమవారం పరిశీలించారు. లక్ష్మింపేట, పోతనపూడి అగ్రహారం, సిహెచ్.గదబూరు పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరడంతో తరగతుల నిర్వహణ ఇబ్బందికరంగా ఉందని, ఈ భవనాలు కూల్చివేసి కొత్త భవనాలు నిర్మించాలని ఉన్నతాధికారులకు విన్నవించామని ఎంఈవో దేముడమ్మ, ఉపాధ్యాయులు డీఈవో దృష్టికి తీసుకు వచ్చారు. సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి కొత్త భవనాల మంజూరుకు కృషి చేస్తానని డీఈవో తెలిపారు.



శిథిల భవనాన్ని పరిశీలిస్తున్న డీఈవో

నెలాఖరులోగా వినియోగంలోకి సంపద కేంద్రాలు

దేవరాపల్లి, జూలై 22: ఈ నెలాఖరులోగా సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకు వస్తామని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం సమన్వయాధికారి ఇ.నాగలక్ష్మి చెప్పారు. దేవరాపల్లి, కె.కోటపాడు, సబ్బవరం మండలాల్లో సోమవారం ఆమె విస్తృతంగా పర్యటించారు. దేవరాపల్లి మండలంలోని నాగయ్యపేట, ఎం.అలమండ, పెదనందిపల్లి, చిననందిపల్లి సంపద కేంద్రాలను పరిశీలించారు. దేవరాపల్లి సంపద కేంద్రం నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లో వీటిని సక్రమంగా నిర్వహిస్తే ప్రజారోగ్యం మెరుగుపడుతుందని ఈ సందర్భంగా ఆమె చెప్పారు. రోడ్లపై చెత్త వేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఈవోపీఆర్డీ నళినిని ఆదేశించారు.



సంపద కేంద్రాలను పరిశీలిస్తున్న నాగలక్ష్మి

పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు

చోడవరం, జూలై 23: మండలంలోని అన్ని పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఎంఈవో జయలక్ష్మి తెలిపారు. కొత్తూరు ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలల్లో ఎకో క్లబ్‌లు ఏర్పాటు చేసి పర్యావరణానికి ఉపయోగపడేలా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. స్థానిక వనరులతో తయారు చేసిన అభ్యసన సామగ్రి ప్రదర్శించడం, పునాది అభ్యసన సంఖ్యాశాస్త్రం అభివృద్ధి, క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. చివరి రోజు విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా సీఆర్‌పీ కేవీఎం నాయుడు తయారు చేసిన అభ్యసన సామగ్రిని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 సింహాచలం, హెచ్‌ఎం వి.లక్ష్మీకుమార్ పాల్గొన్నారు.



అభ్యసన సామగ్రి ప్రదర్శిస్తున్న ఎంఈవోలు

మాడుగుల
నియోజకవర్గం

ఎంపీపీగా బుల్లిలక్ష్మికి బాధ్యతలు



దేవరాపల్లి, జూలై 22: మండల పరిషత్ అధ్యక్షురాలుగా చింతల బుల్లిలక్ష్మికి బాధ్యతలు అప్పగించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో ఎస్.అప్పలరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి ఏప్రిల్ 15వ తేదీన పదవికి రాజీనామా చేయడంతో, కొత్తగా ఎంపీపీని ఎన్నుకున్నంత వరకు ఉపాధ్యక్షురాలుగా ఉన్న బుల్లిలక్ష్మి బాధ్యతలు స్వీకరించాలని సమాచారం అందించామన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచండి

చీడికాడ, జూలై 22: తుఫాన్ వర్షాలు ముగిసే వరకూ గ్రామాల్లో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని, పారిశుధ్యం మెరుగుపరచాలని మండల ప్రత్యేకాధికారి బి.మహేశ్వర్ ఆదేశించారు. మండలంలోని వరహాపురం గ్రామంలో డ్రైనేజీ పనులను ఎంపీడీవో బి.ఉమామహేశ్వరితో కలిసి సోమవారం పరిశీలించారు. డ్రైనేజీల్లో పేరుకుపోయిన మురుగునీటిని తొలగించాలని, చెత్తచెదారం లేకుండా చూడాలని, వాటర్ ట్యాంకులను పరి శుభ్రంగా ఉంచాలని ఈ సందర్భంగా ఆయన ఆదేశించారు. గ్రామాల్లో ఎటువంటి వ్యాధులు సోకినా వైద్యులతో సంప్రదించి తగిన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ కామేశ్వరరావు, కార్యదర్శి కె.చంద్రశేఖర్ పాల్గొన్నారు. అంతకుముందు మండల పరిషత్ కార్యాలయంలో కోనాం జలాశయం నీటిమట్టంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్, ఏవో ఎల్.కామేశ్వరరావు తదితరులతో ప్రత్యేకాధికారి చర్చించారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం

మాడుగుల, జూలై 22: మండల కేంద్రంలోని తుడుమువీధిలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన తురుబిల్లి సంతోష్, పావని కుటుంబానికి టీడీపీ, జనసేన నాయకులు సహాయ సహకారాలు అందించారు. నిత్యావసర సరకులు, వంట సామగ్రితో పాటు కొంత మొత్తంలో నగదు అందించారు. రేకుల షెడ్డు నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటామని బాధితులకు భరోసా ఇచ్చారు.

స్పర్శ లేని మచ్చలతో తస్మాత్ జాగ్రత్త

కె.కోటపాడు, జూలై 22: శరీరంపై స్పర్శ లేని మచ్చలతో జాగ్రత్తగా ఉండాలని హెల్త్ సూపర్‌వైజర్ జె.సన్యాసిరావు సూచించారు. ఆర్‌పై అగ్రహారం, కేజే పురం గ్రామాల్లో సోమవారం వైద్య సిబ్బందితో ఇంటింటికీ వెళ్లి తనిఖీలు నిర్వహించారు. స్పర్శ లేని మచ్చలు ఉంటే తనిఖీలు చేయించుకుని అవసరమైన మందులు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది గంగాధర్‌రావు, మంగవేణి, రాము పాల్గొన్నారు.

నారుమడిలో నీటిని తొలగించండి

దేవరాపల్లి, జూలై 22: అధిక వర్షాలకు నారుమడిలో చేరిన నీటిని తొలగించాలని మండల వ్యవసాయాధికారి ఎల్.వై.కాంతమ్మ సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో వరి నారు మడులను పరిశీలించి రైతులకు సూచనలు ఇచ్చారు. కిలో యూరియా, మ్యురేట్ ఆప్ పొటాస్ ఒక కిలో పిచికారీ చేసి ఐదు సెంట్ల నారు మడికి వేయాలని ఆమె చెప్పారు.

రాచకట్టు నీరు విడుదలకు రైతుల తీర్మానం

మాడుగుల రూరల్, జూలై 22: రావిపాలెం పెద్దేరు జలాశయం రాచకట్టు కాలువ నీటిని విడిచిపెట్టాలని ఆయకట్టు రైతులు తీర్మానం చేశారు. జమ్మాదేవిపేటలో కింతలి, వమ్మలి, సత్యవరం తదితర గ్రామాల రైతులు, నీటి సంఘం సభ్యులు సోమవారం సమావేశమయ్యారు. ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు ఈ నెల 28వ తేదీ నుంచి డిసెంబరు 20వ తేదీ వరకు రాచకట్టు కాలువ ద్వారా నీరు విడిచి పెట్టాలని ఒప్పందం కుదుర్చుకుని తీర్మానించారు. తీర్మాన పత్రాన్ని అంగీకరించాలని కోరుతూ వాటర్ షెడ్ మేనేజ్‌మెంట్ ఈఈ, జలాశయం అధికారులకు నివేదిస్తామని రైతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు ఎన్.మహలక్ష్మినాయుడు, ఎ.జగ్గారావు, జగన్నాథరావు, ఎస్.సన్యాసిరావు, వడ్డి రాజ్‌కుమార్, పెంటారావు, బాజ్జి, కృష్ణమూర్తి, సూర్యనారాయణ పాల్గొన్నారు.